క్లుప్తంగా

రైతులకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న మునగపాక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి నూక నరసింగరావు

మునగపాక: మునగపాక పీఏసీఎస్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సంఘ పర్సన్ ఇన్‌చార్జి విల్లూరి నూక నరసింగరావు కోరారు. శుక్రవారం పాలకవర్గ సభ్యులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తామన్నారు. సీజన్‌లో ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంఘ అభివృద్ధికి రైతులంతా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ డైరెక్టర్లు పాలిపిని రాము, మొల్లి అప్పలరాజు, సంఘ సీఈవో పెంటకోట మహేష్ పాల్గొన్నారు.

సాగునీరు వృథా చేయొద్దు



ఏఈతో మాట్లాడుతున్న చిక్కాల రామారావు, సర్పంచ్‌లు

పాయకరావుపేట: మండలంలోని పలు గ్రామాల రైతులకు సరఫరా చేసే సాగునీటిని వృథా చేయకుండా నిల్వ చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు నీటి పారుదల శాఖ ఏఈ వినయ్‌కుమార్‌ను కోరారు. తాండవ నది నుంచి ప్రవహించే సాగునీరు గోపాలపట్నం ఆవ గర్భంకు వెళ్తే నిల్వ ఉంటుందని, తద్వారా ఆవ దిగువ ఆయకట్టుదారులకు ఉపయోగపడుతుందన్నారు. అలా కాకుండా మధ్యలోనే ఆవ కాలువ, మంగవరం కాలువలకు గేట్లు వేసి ఉంచుతున్నారన్నారు. తాండవ నది ద్వారా ప్రవహించే సాగునీటిని ఆవ గర్భంలో నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏఈకు సూచించారు. ఆవ గర్భంలో సాగునీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకుంటామని ఏఈ హామీ ఇచ్చారు.

వారపు సంతకు దసరా శోభ



సందడిగా అచ్యుతాపురం దసరా పండగ వారపు సంత

అచ్యుతాపురం రూరల్ : దసరా దగ్గర పడడంతో అచ్యుతాపురంలో శుక్రవారం జరిగిన వారపు సంత కళకళలాడింది. పొట్టేళ్లతో పాటు అన్ని రకాల వస్తువుల విక్రయాలు సాగాయి. అయితే అకాల వర్షం కారణంగా దసరా సంతలో అనుకున్నంత వ్యాపారాలు సాగకపోవడంతో వ్యాపారులు నిరాశ చెందారు.

ఆదర్శవంతంగా నాగులాపల్లి సొసైటీ



మాట్లాడుతున్న నాగులాపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి భాస్కరరావు

మునగపాక: రైతుల సహకారంతో నాగులాపల్లి సొసైటీని ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతామని సంఘ పర్సన్ ఇన్‌చార్జి యల్లపు వెంకట భాస్కరరావు అన్నారు. నాగులాపల్లి పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.56.12 లక్షల మేర నికర లాభం వచ్చిందన్నారు. సంఘం ద్వారా డిపాజిట్ల సేకరణ, రుణ పంపిణీ, డివిడెండ్ల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బంగారు ఆభరణాలపై రుణ సదుపాయం కల్పించామన్నారు. అనంతరం గతంలో సంఘ అధ్యక్షులుగా సేవలందించిన వేగి సోమేశ్వరరావు, మళ్ల ఉమామహేశ్వరరావుతో పాటు సంఘ పరిధిలోని 12 మంది సీనియర్ సభ్యులను సత్కరించారు. సంఘ నివేదికను సీఈవో మళ్ల స్వామి సభ్యులకు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సంఘ పర్సన్లు కొంతం జగదీశ్వరరావు, సుందరపు శ్రీనివాసరావు, మునగపాక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి విల్లూరి నూక నరసింగరావు, పలువురు రైతులు పాల్గొన్నారు

గొర్రెల పెంపకందారులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

అనకాపల్లి టౌన్: బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలను గొర్రెల పెంపకందారులకు మంజూరు చేయాలని గొర్రెల పెంపకదార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మృతి చెందిన ప్రతి గొర్రెకు రూ.10వేలు నష్టపరిహారం చెల్లించాలన్నారు.

- ప్రమాదకరంగా పిల్లర్ల గోతులు
- వంతెన నిర్మాణం చుట్టూ కానరాని రక్షణ చర్యలు
- ప్రత్యామ్నాయ మార్గం లేక ట్రాఫిక్ కష్టాలు



పోస్టర్‌కు పరిమితమైన భద్రతా ప్రమాణాల పట్టిక



ఎటువంటి భద్రత చర్యలు లేకుండా సాగుతున్న ఫ్లైఓవర్ పనులు

ఫ్లైఓవర్ పనుల్లో భద్రత ఎక్కడ?



ఇటీవల ఫ్లైఓవర్ పిల్లర్ గోతులో దిగిపోయిన భారీ టిప్పర్ లారీ

అచ్యుతాపురం రూరల్ : మండల కేంద్రం అచ్యుతాపురంలో తలపెట్టిన ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో ఎటువంటి భద్రతా ప్రమాణాలు పాటించడంలేదు. వంతెన నిర్మాణం చుట్టూ ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. దీంతో పిల్లర్ల కోసం తవ్విన గోతుల్లో తరచూ వాహనాలు కూరుకుపోతున్నాయి. ఫలితంగా తరచూ ట్రాఫిక్ కష్టాలు తలెత్తుతున్నాయి. పారిశ్రామిక ప్రాంతమైన అచ్యుతాపురంలో రోజుకు వేలాది మంది ఈ మార్గంలో రాకపోకలు చేస్తుంటారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలే కాకుండా జిల్లా నలుమూలల నుంచి అనేక మంది కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు అచ్యుతాపురం కూడలి మీదుగా ప్రయాణిస్తుంటారు. ఫ్లైఓవర్ పనుల్లో భద్రతా ప్రమాణాలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఉత్సవ విగ్రహంలా భద్రత ప్రమాణాల బోర్డు

భద్రతా ప్రమాణాలు తెలిపే బోర్డు రోడ్డు పక్కన ఉత్సవ విగ్రహంలా దర్శనమిస్తోంది. అయితే ప్రజలతో పాటు ఇక్కడ పనిచేస్తున్న కార్మికులకు కూడా సరైన భద్రత లేకుండా పోయింది. వంతెన నిర్మాణం కోసం తవ్విన గోతుల పక్కన ఎటువంటి హెచ్చరికలు ఏర్పాటు చేయలేదు. కనీసం రిబ్బన్‌లు కానీ, స్టాప్ బోర్డులు కానీ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలకు ఆస్కారంగా మారింది. ఇక్కడ పని చేస్తున్న కార్మికులు కనీసం హెల్మెట్ కూడా ధరించకుండా ఎత్తు ప్రదేశాల్లో పని చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం

అచ్యుతాపురం కూడలి మీదుగా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఉదయం, సాయంత్రం వేళ ఉద్యోగులు, విద్యార్థులతో ఈ కూడలి రద్దీగా ఉంటోంది. ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా ప్రత్యామ్నాయ మార్గం అధికారులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే అటువంటి చర్యలు తీసుకోకపోవడంతో వంతెన పనులు జరుగుతుండగా పక్క నుంచే అందరూ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఈ కూడలిని దాటేందుకు ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. సకాలంలో గమ్యానికి చేరుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన పనుల రక్షణ చర్యలు చేపట్టి, ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ మార్గం లేకపోతే ఎలా?



ప్రత్యామ్నాయ మార్గం చూపకపోవడం కారణంగా అచ్యుతాపురం కూడలిలో అత్యవసర సేవలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. కార్మికులు పరిశ్రమలకు, విద్యార్థులు పాఠశాల, కళాశాలలకు సకాలంలో చేరుకోలేకపోతున్నారు. గంటల కొద్దీ ట్రాఫిక్‌లోనే ఉండిపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– రొంగలి రాము, సీఐటీయు జిల్లా కార్యదర్శి

వైఎస్ జగన్‌ను విమర్శిస్తే సహించం

- బాలకృష్ణకు మెంటల్ అని సర్టిఫికేటే ఉంది
- వైఎస్సార్‌సీపీ నేత వీసం ధ్వజం



వీసం రామకృష్ణ

నక్కపల్లి: బాలకృష్ణ మానసిక రోగి అని 15 ఏళ్ల క్రితమే మెంటల్ సర్టిఫికెట్ మంజూరు చేశారని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అసెంబ్లీలో ఎమ్మెల్యే బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని శుక్రవారం వీసం తీవ్రంగా ఖండించారు. బాలకృష్ణ పెద్ద సైకో అని ధ్వజమెత్తారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బాలకృష్ణ ఇంట్లో కాల్పులు ఎందుకు జరిగాయో అందరికి తెలుసన్నారు. బాలకృష్ణ మానసిక పరిస్థితి బాగా లేకపోవడం వల్లే కాల్పులు జరిపారంటూ అప్పట్లోనే మానసిక వైద్యులతో సర్టిఫికెట్ తెచ్చుకున్నారన్నారు. కేసుల నుంచి బయటపడేందుకు ఈ సర్టిఫికెట్ తెచ్చుకోలేదన్నారు. బాలకృష్ణకు మెంటల్ ఉన్న విషయం వాస్తవమేనని ఆయన విమర్శించారు. సభా మర్యాదలు పాటించకుండా మాజీ ముఖ్యమంత్రిని పట్టుకుని ఇష్టానుసారం మాట్లాడితే సహించేది లేదన్నారు. తాగిన మైకంలో ఏమి మాట్లాడతాడో బాలకృష్ణకే తెలియదన్నారు. సినీ నటుడు చిరంజీవి అంటే జగన్‌కు ఎంతో గౌరవమన్నారు. వైఎస్ జగన్ హయాంలో చిత్రపరిశ్రమ ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించారని గుర్తు చేశారు. చిరంజీవిపై కూడా బాలకృష్ణ తరచూ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. అయినా చిరు సోదరులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్సీ నాగబాబు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బాలకృష్ణ వ్యాఖ్యలను వారు ఖండించాలన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న చోడిపల్లి శ్రీనివాసరావు, దేవవరపు రాజేష్ ఖన్నా

బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి

పాయకరావుపేట: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అసెంబ్లీలో బాలకృష్ణ విమర్శించడం తగదని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చోడిపల్లి శ్రీనివాసరావు, పాయకరావుపేట పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దేవవరపు రాజేష్ ఖన్నాలు అన్నారు. దేవాలయం లాంటి అసెంబ్లీలో బాలకృష్ణ మాటలు కరెక్టు కాదన్నారు. గతంలో బాలకృష్ణ కేసులో ఇరుక్కున్నప్పుడు రాజకీయాలకు పోకుండా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాపాడిన సంగతి గుర్తించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజలందరూ బాలకృష్ణను ఛీ కొడుతున్నారని చెప్పారు. అసెంబ్లీలో వైఎస్ జగన్‌ను అన్న మాటను వెనక్కి తీసుకుని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

తడి, పొడి చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలి



గుడివాడ గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

ఎస్.రాయవరం: ఇళ్లలో తడి, పొడి చెత్తను వేరు చేసి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని ఎంపీడీవో మీనాకుమారి సూచించారు. మండలంలో గుడివాడ గ్రామంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. గృహాలు నుంచి వచ్చే చెత్తను ఎప్పటికప్పుడు తరలిస్తూ నివాసాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్య క్రమంలో సర్పంచ్ దూళి శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'విడాకులు కావాలి' నాటిక



విడాకులు కావాలి నాటికలో ఓ సన్నివేశం

అనకాపల్లి: స్థానిక సతకంపట్టు కనక దుర్గమ్మవారి దసరా ఉత్సవాల్లో భాగంగా గవరపాలెం పార్కు సెంటర్ వద్ద శుక్రవారం రాత్రి ప్రదర్శించిన నాటికలు అలరించాయి. వల్లూరి శివప్రసాద్ రచించగా.. గంగోత్రి సాయి దర్శకత్వం వహించిన విడాకులు కావాలి నాటిక ఆద్యంతం ఆలోచింపజేసింది. దాంపత్య జీవితంలో దంపతుల మధ్య అభిప్రాయ బేధాలు, అపోహలు, చిన్నచిన్న సమస్యలు సహజం. అంతమాత్రం చేత కలిసి బతకలేమన్న తొందరపాటుతో, పంతాలకు పోయి విడాకులు కావాలనుకోవడం ఎంత వరకు సమంజసం. భార్యాభర్తలు మనసు విప్పి మాట్లాడుకోవడం, పని విభజన చేసుకుని పరస్పరం సహకరించుకోవడం, అపార్థాలకు తావులేకుండా చూసుకోవడం, అహంకారంతో పట్టుదలలకు పోకుండా, సర్దుబాటు ధోరణితో సంయమనం పాటించడం వల్ల ఆదర్శ దంపతుల్లా గడపొచ్చు. భారతీయ వివాహ వ్యవస్థలో మన సంస్కృతీ, సంప్రదాయాలే అన్యోన్యంగా నడిపే దారిదీపాలు అంటూ ఇతివృత్తంతో సాగిన ఈ నాటికను కళాకారులు చక్కగా ప్రదర్శించి మెప్పించారు.

భువి కోరని భ్రమణం

భూమి కంటే ముందే అమ్మ మనకి తన గర్భంలో చోటిచ్చి మోస్తుంది. జన్మనిస్తుంది. భూమికంటే అమ్మే గొప్పది. భూమిని ఎంత తవ్వినా ఎప్పుడూ అడ్డుచెప్పదు. అలాగే కన్నతల్లిచే బిడ్డలు ఎంత శ్రమ చేయించుకున్నా అవమానించినా అమ్మకి కష్టం అనిపించదు. అడ్డు చెప్పదు. అలాగని ఇంకెన్నాళ్లు కష్టపెడతాం తప్పు కదా.. గర్భ గుడిలో ఉండే దేవతలాంటి అమ్మ ఇంటింటికి తిరగకూడదు. బిడ్డలే వచ్చి చూసి పోతుండాలి. బలవంతంగా గ్లోబును తిప్పునట్లు గిరగిరా తిప్పకూడదు. అది సృష్టి విరుద్ధం. అందుకే ఇలాంటి బలవంతపు భ్రమణాలను ఏ తల్లి కోరుకోదు. భువి కోరని భ్రమణాన్ని బిడ్డలే అర్థం చేసుకుని ఆపేయాలి. ఎంత కొలిచినా తరగని ఆకాశం.. ఎంత కొలిచినా తీరని రుణం అమ్మతనం. అమ్మను దర్శించండి.. పూజించండి.. ఆశీర్వాదం పొందండి.. తరించండి.. అని సందేశంతో సాగే భువి కోరని భ్రమణం నాటిక ఆహూతుల కరతాళ ధ్వనులు అందుకుంది. మూలకథ ఆచాళ్ల ఉమా మహేష్ కాగా.. రచన తాళాబత్తుల వెంకటేశ్వరరావు. ఈ కార్యక్రమంలో కనకదుర్గమ్మవారి ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ, నాటికల నిర్వాహకులు కె.ఎం.నాయుడు, కర్రి సన్యాసినాయుడు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అధిక పురుగు మందుల వినియోగంతో అనర్థాలు



కొత్తపాలెంలో రైతులకు సూచనలిస్తున్న ఏవో పాలిమేర మోహన్‌రావు

యలమంచిలి రూరల్: మండలంలో సాగులో ఉన్న వరి పంటకు దాదాపుగా నాట్లు పూర్తయ్యాయని, రైతులు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకే పురుగు మందులను తగు మోతాదులో వినియోగించాలని మండల వ్యవసాయాధికారి పాలిమేర మోహన్‌రావు సూచించారు. శుక్రవారం మండలంలో పలు గ్రామాల్లో సాగులో ఉన్న వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఆయా రైతులకు పలు సూచనలిచ్చారు. ముఖ్యంగా అవసరం లేకున్నా పురుగు మందులను వినియోగించవద్దని సూచించారు. తెగుళ్ల రకాన్ని బట్టి తీసుకోవాల్సిన చర్యలను వ్యవసాయాధికారులను సంప్రదించి తీసుకుంటే సాగు వ్యయం తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఎరువులను కూడా అధికంగా వినియోగించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి అరుణ, రైతులు సన్యాసినాయుడు, వెంకటరమణ, వీరు నాయుడు పాల్గొన్నారు.

బొడ్డేడకు అభినందనలు



వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త ప్రసాద్‌ను సత్కరిస్తున్న పార్టీ నేతలు

మునగపాక: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన బొడ్డేడ ప్రసాద్‌ను శుక్రవారం మునగపాకలోని పార్టీ కార్యాలయంలో పలువురు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బొడ్డేడ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవిని కట్టబెట్టిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిదన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. తనకు అవకాశం కల్పించడంలో సహకరించిన పార్టీ సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి, ఉత్తరాంధ్ర కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుతో పాటు పార్లమెంట్ పరిధిలోని పలు నియోజకవర్గాల సమన్వయకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పార్టీ నాయకులు నరాలశెట్టి సూర్యనారాయణ, దాసరి అప్పారావు, పిన్నమరాజు రవీంద్రరాజు, ఆడారి కాశీబాబు, కోనపల్లి రామ్మోహనరావు, కర్రి పెదబ్బాయి, దొడ్డి బుజ్జి, ఇల్లా నాగేశ్వరరావు, మొల్లేటి శంకర్, మొల్లేటి వినోద్, మద్దాల వీరునాయుడు, గంగప్పలనాయుడు, కాండ్రేగుల జగన్, పిట్టా మంగారెడ్డి, గుంట్ల అప్పారావు, అయినంపూడి విజయభాస్కరరాజు, తుట్టా వెంకటప్పారావు, బొడ్డేడ లిల్లి, బొడ్డేడ బుజ్జి, రామజోగినాయుడు, ద్వారం జానకీరామ్, తదితరులున్నారు.

గ్రామాల్లో భారీ అన్నసమారాధనలు



మూలపేటలో కనకదుర్గ అమ్మవారి అంబలం పూజలో భక్తులు



మునగపాకలో అన్నసమారాధనలో భక్తులు

మునగపాక: మండల వ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పలు చోట్ల భారీ అన్న సమారాధనలు, అంబలం పూజలు నిర్వహిస్తున్నారు. మునగపాకలోని గౌరీయాత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారి విగ్రహం వద్ద మునగపాకకు చెందిన ఆడారి వెంకట సత్యనారాయణ–సరోజిని దంపతులు, కాండ్రేగుల జగ్గారావు, నాగయమ్మ దంపతుల సహకారంతో శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. పలువురు భక్తులు అన్న సమారాధనకు హాజరై దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. మూలపేట గంగాలమ్మతల్లి గుడి ఆవరణలో గురువారం రాత్రి సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు ఆధ్వర్యంలో భారీ అంబలం పూజ నిర్వహించారు.

పాల్తేరులో స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

పాయకరావుపేట: పాల్తేరు గ్రామంలో అక్కిరెడ్డి వెంకటనాగేశ్వరరావుకు సంబంధించిన స్థలాన్ని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించి ఆలయ నిర్మాణానికి ప్రయత్నిస్తున్నారని తహసీల్దార్ ఎస్.ఎ.మహేశ్వరరావుకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు శుక్రవారం ఫిర్యాదు చేశారు. వెంకటనాగేశ్వరరావుకు గ్రామంలో సర్వే నంబరు 155లో 137 సర్వే నంబరును ఆనుకుని 20 సెంట్లు ఉందని, దానిని కొందరు ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై హైకోర్టులో దావా నడుస్తుందని, యథాస్థితిని కొనసాగించాలని ఆదేశాలు కూడా ఉన్నాయని చిక్కాల తెలిపారు. కానీ కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా కొందరు వ్యక్తులు స్థలంలో పనులు చేపడుతున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై తహసీల్దార్ స్పందిస్తూ సదరు స్థలంలో తాము రెండు రోజుల క్రితమే హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు సీఐ జి.అప్పన్నను కలిసి ఈ వ్యవహారంపై వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, గోపాలపట్నం, మంగవరం, పాల్మన్‌పేట, కేశవరం, మాసాహేబుపేట, పెంటకోట సర్పంచ్‌లు పన్నీరు బాబ్జి, వంగలపూడి సరస్వతీ రామారావు, కోడ కోటేశ్వరరావు, మేడిశెట్టి రామగోవిందు, గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, చేపల నాగమణి తాతాజీ, పాయకరావుపేట ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పార్టీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి యజ్జల అన్నవరం, పాల్తేరు గ్రామ నాయకులు అక్కిరెడ్డి శ్రీధర్, ఏవీఆర్, అడపా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బెల్లం తయారీ కేంద్రం తనిఖీ



బెల్లం తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్

రావికమతం: గుడివాడ పంచాయతీ మట్టవానిపాలెంలో బెల్లం తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తనిఖీ చేశారు. శేషుబాబు బెల్లం తయారీ కేంద్రంలో హానికరమైన నిషేధిత రసాయక పదార్థాలు, రంగులు ఉపయోగిస్తున్నట్టు కలెక్టర్ దృష్టికి వెళ్లింది. కలెక్టర్ ఆదేశాల మేరకు కేంద్రంలో తనిఖీలు నిర్వహించి, శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపినట్టు రవికుమార్ తెలిపారు.

లోకజనని.. కరుణ రూపిణి

- వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



గాయత్రీ ఆధ్యాత్మిక జ్ఞానపీఠంలో అమ్మవారికి నిత్యపూజ నిర్వహిస్తున్న దంపతులు



నునపర్తి కొండపై కుంకుమార్చనలో భవానీ భక్తులు



దార్లపూడిలో దుర్గమ్మకు కుంకుమ పూజ చేస్తున్న భక్తులు

యలమంచిలి రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వాడవాడలా అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఐదో రోజు అమ్మవారిని బాల త్రిపురసుందరి అవతారంలో అలంకరించారు. అమ్మవారికి అర్చకులు పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ చైర్మన్ బండారు సత్య బంగారుశెట్టి పర్యవేక్షించారు. సమితి ఆఫీసు వీధిలో గాయత్రీ ఆధ్యాత్మిక జ్ఞానపీఠంలో ఐదో రోజు అమ్మవారిని మహాలక్ష్మి అవతారంలో అలంకరించి పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మరో వైపు యలమంచిలి పట్టణం, మండలంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక వైభవం ఉట్టిపడుతోంది. విద్యుద్దీపాలంకరణలో అమ్మవారిని ఏర్పాటు చేసిన పందిళ్లు వెలుగులీనుతున్నాయి.



నునపర్తి కొండపై వెలసిన కనకదుర్గమ్మ

ఎస్.రాయవరం: దార్లపూడి గ్రామంలో దుర్గమ్మకు శుక్రవారం కుంకుమ పూజ నిర్వహించారు. అమ్మవారి మండపం వద్ద మహిళలు పెద్ద ఎత్తున చేరుకుని సుమారు రెండు గంటల పాటు వేదమంత్రాల నడుమ అమ్మవారికి పసుపు కుంకుమలతో పూజ చేశారు.

నునపర్తి దుర్గమ్మ ఆలయంలో..

అచ్యుతాపురం రూరల్ : నునపర్తి కొండపై వెలసిన కనకదుర్గమ్మ అమ్మవారికి భవానీ భక్తులు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు చేశారు. మాతాజీ గెద్దం కాసులమ్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గెద్దం నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.



కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

మహా రాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P. 14/2021 O.S. 170/2014

Between:
మద్ది మహేశ్వరరెడ్డి (Died) and 3 Others
మద్ది సత్యవతి, మద్ది నాగ రవికుమార్, మద్ది నాగలక్ష్మి
– వాది/DHRs
And:
నీలపు కనక అప్పల వెంకట రమణారావు
– ప్రతివాది/JDR

వేలం ప్రకటన

పై నెంబరు అమలులో JDRకు చెందినటువంటి ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని పై నెంబరు దావా డిక్రీ బాకీ వసూలు నిమిత్తం మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) వారు కోర్టు వారి ఎదుట తేది: 08-10-2025 ఉదయం 10:30 గం॥ల నుండి ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని శ్రీ కోర్టు వారు వేలం షరతులకు DHRs వద్ద JDR తీసుకున్న బాకీ నిమిత్తం లోబడి వేలం వేయుదురు. కావున వేలంలో పాల్గొన వచ్చినవారు తేది: 08-10-2025న శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వేలంలో పాల్గొనవచ్చునని ఇందుమూలంగా ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

వేలం షెడ్యూల్ వివరాలు

విశాఖపట్నం (అనకాపల్లి) జిల్లా, పాయకరావుపేట మండలంలో నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్ నందు కుమారపురం గ్రామంలో సర్వే నెం. 136/1 వెట్ ల్యాండ్ ఏన్ ఎక్స్టెంట్ ఆఫ్ ఒక ఎకరా తొంబై తొమ్మిది (1.99) సెంట్లు భూమికి ఈ క్రింది హద్దుల మధ్య కలదు. East: మద్ది శ్రీనువాసరెడ్డి & Others, South: నీలపు వెంకటరమణ & Others, West: నీలపు సత్యనారాయణ & Others, North: మురికి కాలువ.

Value of DHR : Rs. 10,00,000/-
Value of AMIN : Rs. 60,00,000/-
Market Value : Rs. 27,86,000/-

D.B.P. RAMA RAO, Advocate
Opp. of Court, Yellamanchili,
Anakapalli Dist. Cell: 9848219590
Yellamanchili
Date: 26-09-2025